ఎట్టకేలకు ఆరిలోవ రైతుబజార్ ప్రారంభం

స్థానికుల విమర్శలు, సాక్షి కథనాలతో దిగొచ్చిన కూటమి నాయకులు, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ : ఎన్నో ఏళ్లుగా రైతు బజార్ కోసం ఎదురు చూస్తున్న ఆరిలోవ ప్రజల నిరీక్షణ ఫలించింది. స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతోపాటు, సాక్షి కథనాలతో దిగొచ్చిన కూటమి నాయకులు, అధికారులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కృషితో ఆరిలోవ ప్రజల ఆకాంక్ష నెరవేరింది. 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరిలోవ రైతు బజార్ నిర్మాణ పనులు ప్రారంభించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దీని పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దీనిపై పలుసార్లు సాక్షిలో కథనాలు ప్రచురించడంతోపాటు స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ఎమ్మెల్యే, మార్కెటింగ్ శాఖ అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో దిగొచ్చారు. మిగిలిన పనులు సుమారు రెండు నెలల క్రితమే పూర్తి చేయించారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీకి, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి మంచి పేరొస్తుందని ప్రారంభించకుండా వదిలేశారు. దీనిపై గత నెల 30న 'ప్రారంభించే నాథుడేడీ' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆగమేఘాలపై ప్రారంభానికి సన్నాహాలు చేసి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, 10, 13వ వార్డుల కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, కెల్ల సునీతతో కలిసి బుధవారం ప్రారంభించారు.



ఎమ్మెల్యే, అధికారులు ప్రారంభించిన ఆరిలోవ రైతుబజార్

పూర్తికాని రైతుల ఎంపిక ప్రక్రియ

ఆరిలోవ రైతు బజార్‌లో విక్రయాలు చేపట్టేందుకు ఇంకా రైతులను ఎంపిక చేయలేదు. ఇందుకోసం సుమారు 1000 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ తెలిపారు. వారిలో అవసరమైన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఇక్కడ 43 షాపులు నిర్మించామని... వాటిలో 5 కమర్షియల్ షాపులకు కేటాయించామన్నారు. ఇంకా రైతులను ఎంపిక చేయకపోవడంతో మొదటి రోజు ఎంవీపీ, సీతమ్మధార, గోపాలపట్నం రైతు బజార్ల నుంచి రైతులను తాత్కాలికంగా ఇక్కడకు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇక్కడ రాత్రి వేళ ఉండేందుకు వీలుగా గిరిజన రైతులకు ఒక గది, స్టోర్ రూం నిర్మించనున్నట్లు తెలిపారు.

మాజీ మేయర్‌ను ఆహ్వానించని అధికారులు

ఆరిలోవ ప్రాంతానికి చెందిన మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కృషితో 2022లో రైతు బజార్ మంజూరైంది. ఇందుకోసం ఆమె తోటగరువు హైస్కూల్ పక్కన సుమారు 60 సెంట్లు స్థలం చూపించి రెవెన్యూ అధికారులు కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. ఆ స్థలంలో బజారు నిర్మాణానికి మార్కెటింగ్ శాఖతో రూ.80 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభింపజేశారు. ఎన్నికల సమయానికే సుమారు 90 శాతం పనులు పూర్తయిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మాణ పనులు పడకేశాయి. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతోపాటు సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంతో మిగిలిన పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆరిలోవ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు లక్ష మంది ప్రజానీకానికి రైతుబజార్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిరంతరం కృషి చేసిన అప్పటి మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కూటమి నాయకుల ఆదేశాలతో అధికారులు ప్రారంభానికి ఆహ్వానించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రైతుబజార్ నిర్మాణానికి ఆమె చేసిన కృషిని కూటమి నాయకులు జీర్ణించుకోలేకే ఆమెను ఆహ్వానించలేదని స్థానికులు అంటున్నారు.

దసరా సంబరాలు షురూ

- నందడిగా స్వీట్ షాపులు, రైతుబజార్లు, షోరూమ్‌లు
- బుధవారమే పొట్టేళ్ల వేట ప్రారంభించిన మాంసాహార ప్రియులు
- కొనుగోలుదారులతో ఎంవీపీకాలనీ, ఆరిలోవ, మద్దిలపాలెంలో రద్దీ


వినియోగదారులతో కిటకిటలాడుతున్న ఎంవీపీ రైతు బజార్


పువ్వులు, పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు


టీటీడీ సర్కిల్ వద్ద దసరా ఉత్పత్తుల విక్రయాలు


ఎంవీపీ కాలనీలో కిటకిటలాడుతున్న ఓ స్వీట్‌షాప్

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ : అమ్మలగన్న అమ్మ.. దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. మరోవైపు విజయదశమి సంబరాలు ఆరంభమయ్యాయి. దసరా పండగ కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఇప్పటికే విశాఖ చేరుకున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి విశాఖ తూర్పు నియోజకవర్గంలో నివసిస్తున్న వారంతా స్వస్థలాలకు వెళ్లిపోయారు. స్థానికంగా ఉన్న వారు పండగకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లతో ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, ఆరిలోవ ప్రధాన కూడళ్లు బుధవారం రోజంతా సందడిగా కనిపించాయి. ఎంవీపీ రైతుబజార్‌కు బుధవారం సెలవు అయినప్పటికీ మార్కెటింగ్ శాఖ అధికారులు దసరా నేపథ్యంలో తెరిపించడంతో కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది. దసరా సంబరాల్లో జంతు బలి తప్పనిసరి కావడంతోపాటు మాంసాహార ప్రియులు బుధవారమే 'పొట్టేళ్ల బలి' ప్రారంభించేశారు. మరోవైపు మద్యం ప్రియులతో దుకాణాలు కిటకిటలాడాయి. బుధవారం సాయంత్రం నుంచే దసరా కిక్ స్టార్ట్ అయిపోయింది.

నియోజకవర్గంలో జోరుగా వ్యాపారాలు

దసరా సంబరాల్లో మిఠాయిలది ప్రత్యేక స్థానం. స్నేహితులు, బంధువులకు అందించేందుకు రకరకాల స్వీట్లు కొనుగోలు చేస్తుంటారు. ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, ఆరిలోవ ప్రాంతాల్లోని పలు స్వీటు దుకాణాల్లో ప్రత్యేక వంటకాలు వినియోగదారులను స్వాగతించాయి. వాటితోపాటు పలు సంస్థల్లో ఉద్యోగులకు పండగ కానుకలు ఇచ్చేందుకు వస్తువుల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా కనిపించాయి. జీఎస్టీ చార్జీల తగ్గింపుతో మోటార్ సైకిళ్లు, గృహోపకరణాల కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. ఎలక్ట్రానిక్, మోటార్ సైకిళ్లు, వస్త్ర, బంగారు దుకాణాల్లో భారీగా అమ్మకాలు జరిగాయి. షోరూమ్‌లలో కొన్ని మోడళ్ల బైక్‌లకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఆఫర్లు పెట్టారు. కార్లు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు తగ్గింపుతో అమ్మకాలు జరుపుతున్నారు.

వాహనపూజకు సర్వం సిద్ధం

ఇప్పటికే నియోజకవర్గంలోని కంపెనీల్లో దసరా సంబరాలు ముగిశాయి. ఇక దసరా నాడు వాహనాలకు పూజ చేయడం సంప్రదాయం. లారీలు, బస్సులు, ఆటోలు, మోటారు సైకిళ్లు, ఇతర వాహనాల వాటర్ సర్వీసింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. తమ ప్రయాణం సురక్షితంగా సాగాలని... కష్టాలన్నీ తొలగి శుభం కలగాలని దుర్గమ్మను ప్రార్థిస్తూ వాహనాలకు పూజలు చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

కిటకిటలాడిన ఎంవీపీ రైతు బజార్

దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంవీపీ రైతు బజార్ కిటకిటలాడింది. గ్రామీణ పూజా సామగ్రి, పండ్లు, పువ్వులు వంటివి కొనేందుకు వినియోగదారులు పోటెత్తారు. దీంతో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వినియోగదారుల రద్దీ కొనసాగింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రైతు బజార్ అధికారులు ఏర్పాట్లు చేయడంతో విక్రయాలు సజావుగా జరిగాయి. సీతాఫలం, జామ, వెలగ, బత్తాయి, దానిమ్మ, మారేడు, అరటి పళ్లను గుట్టలుగా పోసి విక్రయించారు. ప్రస్తుతం పువ్వుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ పండగ దృష్ట్యా వినియోగదారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. మామిడి, తులసితోపాటు అరటి బొంతలు, కొబ్బరి కాయలు, నిమ్మకాయలు పెద్ద ఎత్తున విక్రయించారు. దీంతోపాటు టీటీడీ సర్కిల్‌లో సైతం ఆయా ఉత్పత్తులను వ్యాపారులు విక్రయించారు.

కనులపండువగా చండికాదేవి సారె ఊరేగింపు


చండికాదేవి సారె ఊరేగింపులో భక్తులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో దసరా ఉత్సావాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులు ఉదయం నుంచి పూజల్లో పాల్గొన్నారు. మహిషాసురమర్దినిగా బుధవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి మూలవిరాట్‌కు కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం చండికాదేవి అమ్మవారి సారె ఊరేగింపు కనులపండువగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పుల మధ్య వైభవంగా జరిగింది. మహిళ భక్తులు, చిన్నారులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉమాదేవి సారె ఊరేగింపునకు హారతివ్వగా కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ అమ్మవారి ప్రతిమకు వాహనంలో ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం సెక్టార్ – 4లోని ఆలయ ప్రాంగణం నుంచి సెక్టార్ – 5 టీటీడీ కూడలి మీదుగా ఊరేగింపు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజన బృందాల ప్రదర్శనలు భక్తులను, స్థానికులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు బోర్‌వెల్ శ్రీహరిరాజు, ఎస్.మూర్తి, రామమోహన్‌రావు, వెంకటరావు, టీఎస్ మూర్తి, రామకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి ప్రతిమకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : విశాఖ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 21 అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో కె.నీలిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల వివాహిత మహిళలు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 3వ తేదీ నుంచి 14 వరకు సమర్పించాలని సూచించారు. ఖాళీలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని నివాసితులే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

భానోజీరావుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని భానోజీనగర్ భూదాత భానోజీరావు జయంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. భానోజీనగర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు మాట్లాడుతూ భానోజీరావు వల్ల వందల కుటుంబాలకు నివాసం లభించిందని కొనియాడారు.

అలరించిన చిన్నారుల కోలాటం


శిల్పారామం కళావేదికపై కోలాట నృత్యం చేస్తున్న చిన్నారులు

పీఎం పాలెం: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా తెలుగునాట అంతటా మార్మోగుతున్న రఘుకుల తిలకా రారా గీతానికి చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యం హైలెట్‌గా నిలిచింది. వినాయక కౌతం.. ప్రణవాలయం.. అన్నమయ్య కీర్తనలకు కూచిపూడి నృత్యం ప్రదర్శించగా, ఘల్లు ఘల్లు.., అబ్బ వద్దు..., రాజాం కొండ మీద..., దసరా వచ్చిందయ్యా.. తదితర గీతాలకు జానపద నృత్యం ప్రదర్శించిన కళాకారులు ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. డి.మీనా నృత్య దర్శకత్వంలో కళాకారులు బిందుశ్రీ, యోగిని, లక్ష్మీ ప్రియ, కుసుమ, సంకీర్తన, ప్రత్యూష, కల్పన, శరణ్య తదితర చిన్నారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

దుర్గమ్మ మండపాల వద్ద అన్నసమారాధనలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట రజకవీధిలో స్థానిక రజక సేవా సమైక్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు వేములవలస అప్పారావు, నిర్వాహకులు వేములవలస అప్పలరాజు, శ్రీను, సూర్యారావు, ఉపేంద్ర, అభి, శేఖర్, వంశీ, కార్తీక్, నాగేంద్ర, పెద్దబాబి, జగదీష్, సునీల్, శ్రీను, రవి, కిరణ్, చిన్న బాబి, వెంకటేష్, అరుణ్, గణేష్, దేవా, రాజు, బ్రహ్మాజీ, సాయి పాల్గొన్నారు.

జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో...

జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆయన భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలో మ్యాంగో లయన్ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ ప్రారంభించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, నిర్వాహకులు రామకృష్ణ, వెంకటేష్, శివ, అజయ్, సింహాద్రి, అభిషేక్ పాల్గొన్నారు.


పీతలవానిపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

విజయకనకదుర్గకు వెండి కిరీటం బహూకరణ


కిరీటాన్ని అందజేస్తున్న కల్యాణ్, మొల్లి అప్పారావు

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డు అప్పుఘర్ కూడలిలో కొత్తగా వెలసిన విజయకనకదుర్గ అమ్మవారికి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ వెండి కిరీటాన్ని బుధవారం బహూకరించారు. అప్పుఘర్‌లోని శ్రీ జలాంధ్ర ఆటో స్టాండ్ వద్ద స్థానికులు ఇటీవల అమ్మవారిని నెలకొల్పారు. ఈ నేపథ్యంలో ఉమ్మిడి కల్యాణ్ బుధవారం వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావుతో కలిసి మేళతాళాలు, సాంస్కృతిక బృందాల ప్రదర్శనలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని కిరీటధారణ నిర్వహించారు. 50 తులాల వెండితో ఈ కిరీటాన్ని తయారు చేయించి అమ్మవారికి బహూకరించినట్లు కల్యాణ్ వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, తూర్పు ఎస్సీ విభాగం అధ్యక్షుడు భవానీ శంకర్, గ్రామ పెద్దలు మారుపల్లి పరదేశి, ఉమ్మిడి నర్సింగ్, వాసుపల్లి అప్పలరాజు, గిరికిన ధనలక్ష్మి, జ్యోతి, ఈశ్వరరావు, చంటి, యర్రయ్య, యల్లాజీ, రమణబాబు, రమణ, రాజేష్, శివ, గోపి, రాంబాబు, కనకరాజు పాల్గొన్నారు.

ఆకెళ్ల రమణమూర్తి మృతికి సంతాపం


ఆకెళ్ల రమణ మూర్తి (ఫైల్)

ఎంవీపీ కాలనీ : న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకెళ్ల రమణమూర్తి మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఎంవీపీ కాలనీకి చెందిన ఆయన గత కొంతకాలంగా గుండె సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. గతంలో విశాఖ హోటల్స్ యజమానుల సంఘం అధ్యక్షుడిగా పనిచేయడంతోపాటు న్యాయవాదిగా ఆయనకు మంచి పేరు వుంది. కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడిగా చాలా కాలం పార్టీకి సేవలు అందించారు. గత కొంతకాలంగా అనారోగ్యం కారణంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన మృతిపట్ల పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు నాయకులు ఎంవీపీ కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. గురువారం సంతాప సభ నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు సత్కారం


పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డుకు చెందిన కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులకు పార్టీ అధిష్టానం రాష్ట్ర, నియోజకవర్గ పరిధిలోని పలు అనుబంధ సంఘాల పదవులలో నియమించింది. దీంతో పదవులు పొందిన వారి కోసం వార్డు నాయకులు బుధవారం అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో వార్డుకు చెందిన గుడపాటి విక్టర్‌ను రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, బెవర జగదీశ్వరరావును రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శిగా నియమించారు. దీంతోపాటు ఇదే వార్డుకు చెందిన బేత దుర్గారావును నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా, డాక్టర్ ఆర్.ఎస్.నాయుడిని డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా నియమించారు. వారిని పార్టీ వార్డు కార్యాలయంలో అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సుబ్బారావు, సాగరిక, బేగం, శ్రీనివాస్, రాము, కృష్ణంరాజు, బాబూరావు, గోవింద్, మేరీ, అప్పలనాయుడు, గంగరాజు, వెంకట్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని... నమోస్తుతే


మహిషాసురమర్దినిగా లలితాదేవి


మహిషాసురమర్దినిగా పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్ : కిర్లంపూడి లే అవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠంలో లలితా దేవి అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యం అమ్మవారు ఒక్కో రూపంలో దర్శనమిస్తున్నారు. అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించినట్లు అర్చకులు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు.

విజయదుర్గ ఆలయంలో లక్ష కుంకుమార్చన

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి హనుమంతవాక వద్ద విజయదుర్గాకాలనీలోని విజయదుర్గాదేవి ఆలయంలో బుధవారం సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అర్చకులు పూజలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. హనుమంతవాక, విజయదుర్గాకాలనీ, క్రాంతినగర్, సంజయ్‌గాంధీకాలనీ, పెదగదిలి తదతర ప్రాంతాల భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.


సారె ఊరేగింపులో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, మువ్వల సురేష్, భక్తులు

వైభవంగా అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

బీచ్‌రోడ్డు : పెద్దవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సామూహిక లక్ష కుంకుమార్చన మహిళలతో నిర్వహించారు. సాయంత్రం సన్నిధిలో గల కళావేదికపై డాక్టర్ ద్వారం త్యాగరాజు శిష్య బృందం నిర్వహించిన భక్త సంగీత గాత్ర కచేరీ శ్రావ్యంగా కొనసాగింది.

ముఖ్య అతిథిగా హాజరైన దేవదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ మాట్లాడుతూ శరన్నవరాత్రుల్లో దుర్గాదేవిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. వారికి ప్రశంసా పత్రాలను ఆలయ ఈవో కె.గాయత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక్‌నగర్‌లో దుర్గాదేవి సారె ఊరేగింపు

బీచ్‌రోడ్డు : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మహిళలు, భవానీ మాలధారులు ఘటాలు, సారె ఊరేగించారు. బుధవారం సాయంత్రం జీవీఎంసీ 20వ వార్డు పరిధి శ్రామిక్‌నగర్‌లో దుర్గాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం మొల్లి అప్పారావు మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాము, సతీష్, క్రాంతి, పద్మ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


వేదికపై అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు


లక్ష కుంకుమార్చనలో మహిళలు